క్లుప్తంగా

ఆర్‌ఐను సత్కరించిన తహసీల్దార్


ఆర్‌ఐను సత్కరిస్తున్న తహసీల్దార్ తారకేశ్వరి

మల్కాపురం: ములగాడ తహసీల్దార్ కార్యాలయం నుంచి బదిలీపై ఏపీ సెక్రటేరియట్‌కు వెళ్లిన ఆర్‌ఐ రమేష్‌నాయుడును ములగాడ తహసీల్దార్ తారకేశ్వరి సత్కరించారు. ఈ సందర్భంగా తారకేశ్వరి మాట్లాడుతూ ఇంత కాలం ఇక్కడ ఆర్‌ఐగా విధులు నిర్వహించిన రమేష్‌నాయుడు బదిలీపై ఉన్నత పోస్టుకు వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. రమేష్‌నాయుడు స్థానంలో కొత్తగా వచ్చిన ఆర్‌ఐ రమాను తహసీల్దార్ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సుధకు సత్కారం


కార్పొరేటర్ సుధను సత్కరిస్తున్న భోగవల్లి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధను ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భోగవల్లి మాట్లాడుతూ వార్డు పరిధిలో రెండేళ్లలో సుమారు రూ.5 కోట్ల మేర వివిధ అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా నిరుపేదలను ఆదుకుంటూ పెద్ద మనసు చాటుకున్నారన్నారు. సుధ మాట్లాడుతూ ఏ నాయకుడైనా నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరించగలిగితే వారికి ఇలాంటి ఆదరణ ప్రజల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చట్టి నూక రాజుయాదవ్, దాడి సత్యనారాయణ, మజ్జి కైలాస్, గోవిం పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో అలేఖ్యకు బంగారు పతకం


పతకం సాధించిన అలేఖ్య

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన అలేఖ్య బాక్సింగ్ పోటీలో బంగారు పతకం సాధించింది. దీంతో పారిశ్రామిక ప్రాంత సీనియర్ బాక్సర్లు, కోచ్‌లు అలేఖ్యను అభినందించారు. సింధియా కాలనీలో నివాసం ఉంటున్న అలేఖ్య ఇటీవల పంజాబ్‌లో జరిగిన కేవీ 53 నేషనల్ బాక్సింగ్ పోటీలలో లేపీ నుంచి 40-42 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించింది. దీంతో బాలికకు కోచింగ్ ఇచ్చిన మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ కోచ్ ప్రసాద్‌తో పాటు రైల్వే కోచ్ షైక్ ఆలీ, సాయి అకాడమీ కోచ్‌లు దుర్గారావు, కన్నా అభినందించారు.

నేడు మహా ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ రాజకీయ నిర్ణయంపైనే ఆధారపడి ఉందని సీపీఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి పి. శ్రీనివాసరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆదివారం గాజువాకలో జరిగే మహాధర్నా గోడప్రతులను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన ప్లాంట్‌ను కాపాడడానికి రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి కేంద్రానికి వాణి వినిపించాలని డిమాండ్ చేశారు.ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాజువాకలో చేపట్టే మహా ధర్నాలో ఉక్కు ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యు. రామస్వామి, కె.ఎం. శ్రీనివాస్, వై.టి. దాస్, టి.వి.కె. రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


సింహాచలం రైల్వే స్టేషన్‌లో మరుగుదొడ్లు



తాళాలు వేసి ఉన్న మరుగుదొడ్లు, స్నానాల గదులు


తాళాలు వేసి ఉన్న దివ్యాంగుల మరుగుదొడ్ల గది

సింహాచలం రైల్వేస్టేషన్‌లో.. నీటి కష్టాలు!


నిరీక్షించినా.. నీరు రాదాయే..

- మరుగుదొడ్లకు తాళాలు
- చుక్క నీరు రాని మంచినీటి కుళాయిలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, అప్పన్న భక్తులు
- మూడు నెలల నుంచి అవస్థలు


కుళాయి నుంచి నీరు రాలేదని చూపిస్తున్న ప్రయాణికుడు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌ను వసతుల సమస్య వేధిస్తోంది. ప్రధానంగా నీరులేక ప్రయాణికులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌లో రైలు ఆగగానే మంచినీరు పట్టుకుందామని ప్లాట్‌ఫారంపైకి వెళ్తే ఏ కుళాయిలో కూడా చుక్కనీరు కానరావడం లేదు. దీంతో ఇదేమి స్టేషన్‌రా బాబూ అంటూ ప్రయాణికులు వెనుదిరగాల్సి వస్తోంది. ఉదయాన్నే ఏ పూరి- తిరుపతి రైలుకు వచ్చే దూర ప్రయాణికులు ఈ స్టేషన్‌లో దిగి కాస్తా ఫ్రెష్ అయి వెళ్దామనుకుంటే ఇబ్బందే. ఇక్కడి మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంటాయి. ఇదేంటి అయ్యా అంటే నీరులేకపోతే తెరిచి ఏం ప్రయోజనం అటూ విరుసుగా నిర్వాహకులు చెబుతుండడం పరిపాటైంది.

పాడైన మోటారు

3 నెలలు కిందట సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఓవర్‌హెడ్ ట్యాంక్ మోటార్ పాడైంది. దీంతో ప్రత్యామ్నాయంగా నార్త్ సింహాచలం స్టేషన్ నుంచి నీరు ఈ ట్యాంక్‌కు వచ్చే ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడి అవసరాలకు సరిపడగా నీరు అందడం లేదు. తాజాగా 3,4 రోజులుగా కనీసం నీరు రావడం లేదని నిత్యం ప్రయాణించే ప్రయాణికులు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా..

నీటి కష్టాలపై స్టేషన్ సిబ్బంది పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇక్కడి వాటర్ ట్యాంక్ మోటారు బాగు చేసినా నీరు అందక పోవడంతో నిరుపయోగంగా పడి ఉందని ఇక్కడి వారు చెబుతున్నారు. వార్ ట్యాంక్ పూర్తి స్థాయిలో బాగు చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఉదయం సమయంలో...

ఉదయం రైళ్లలో వచ్చే ప్రయాణికులకు మరుగుదొడ్లు అందుబాటులో లేక పోవడంతో తప్పనసరిగా రైలు పట్టాల వైపు, స్టేషన్ ప్రాంతాల్లో వెళ్తుండడంతో ఈ పరిసరాలు జుగుప్సాకరంగా తయారవుతున్నాయి. మల మూత్ర విసర్జలు చేయడంతో దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నా మని కొందరు ప్రయాణికులు, వేచి ఉండే వారు చెబుతున్నారు. స్టేషన్‌కు వచ్చేవారి అవసరాలు తీర్చే విధంగా మరుగుదొడ్లు తెరవడంతో పాటు తాగు నీరుఅందివ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తాగు నీరు లేక ఇబ్బంది



మంచినీరు కోసం ప్లాట్‌ఫారం ఉన్న కుళాయిల వద్దకు వెళ్లాను. ఎక్కడా నీరు రాలేదు. బయట నీటి బాటిల్ కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇక్కడి ఆర్వో ప్లాంట్ కూడా మూసి వేసి ఉంది. చాలా ఇబ్బందిగా ఉంది ఈ స్టేషన్‌లో.

– స్వాద్ దాస్, బరంపూర్

అధికారులు పట్టించుకోవాలి



సింహాచలం దేవస్థానానికి కుటుంబంతో వచ్చాం. సింహాచలం రైల్వే స్టేషన్‌లో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉన్నాయి. కనీసం మంచినీరు పట్టుకుందామని చూస్తే ఏ కుళాయిలో కూడా నీరు రావడం లేదు. పిల్లలతో చాలా ఇబ్బంది పడ్డాం. అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోవాలి.

– ఎల్ బాబు, ప్రయాణికుడు, బరంపూర్

డబ్బులిచ్చి నీరు కొనుక్కున్నా..



నీరులేక చాలా ఇబ్బందులు పడ్డాం. చేసేదేమీ లేక అన్ని అవసరాలకు నాలుగు నీటి బాటిళ్లు కొనాల్సి వచ్చింది. పిల్లలు టాయిలెట్‌కు వెళ్తామంటే ఏమి చేయాలో తెలియని పరిస్థితి. సింహాచలం దేవస్థానం భక్తులు ఎక్కువగా వచ్చే ఈ స్టేషన్‌లో అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం దారుణం.

– ఎ.రామయ్య, ఇచ్ఛాపురం

పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి కల్పించాలి

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో జరుగుతున్న విస్తరణ పనుల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ పశ్చిమ నాయకుడు అతుకుమశెట్టి రామచంద్రరావు కోరారు. స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తూ స్థానికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. **హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్,** డాక్‌యార్డ్ పరిశ్ర**మల్లో ఉపాధి కల్పించాలని** డిమాండ్ చేశారు. **అనంతరం జిల్లా కలెక్టర్** హరేందిర ప్రసాద్, **పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు**, టీడీపీ రాష్ట్ర అధ్య**క్షుడు పల్లా శ్రీనివాసరావు**కు వేర్వేరుగా విన**తిపత్రాలు అందజేశామన్నారు.**

ఘనంగా ఇంజినీర్స్ డే


నమూనాలను పరిశీలిస్తున్న నారాయణరావు, బెహరా విజయ చైతన్య తదితరులు

గోపాలపట్నం: ఇంజినీరింగ్ విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచిస్తే మంచి ఇంజినీర్‌గా తయారవుతాడని కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి నారాయణరావు అన్నారు. నరవలోని బెహరా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంజినీర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా పేరుగడించిన ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజినీర్స్‌డేగా నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశంలో నదులపై వంతెనలు కట్టి నీటి పారుదల, మంచినీటి పథకాల ద్వారా ప్రజలకు మేలు చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. బెహరా విద్యాసంస్థల సెక్రటరీ బెహరా విజయ చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలు తెలుసుకుని అనుసరించేందుకు ప్రయత్నించాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన నమూనాలను వీక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బాణాల తరుణ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా అన్నసమారాధనలు


61వ వార్డులో వడ్డన చేస్తున్న సీఐ విద్యాసాదర్, కార్పొరేటర్ సుధ


త్రినాథపురంలో వడ్డన చేస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్,మజ్జి మాలినాయుడు


శ్రీహరిపురం వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం : వినాయక నవరాత్రుల సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా మండపాల వద్ద భారీ అన్న సమారాధన, దీపారాధనలు నిర్వహించారు. 61వ వార్డులో యాదవ్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మల్కాపురం సీఐ విద్యాసాగర్, వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, వార్డు టీడీపీ మహిళ అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మీయాదవ్ పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు నిర్వహించిన భారీ అన్న సమారాధను వారు ప్రారంభించారు. అలాగే 62వ వార్డు త్రినాథపురం వద్ద జరిగిన అన్న సమారాధనలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, టీడీపీ నాయకుడు మజ్జి మాలి నాయుడు తదితరులు పాల్గొన్నారు. 59వ వార్డు పరిధి శ్రీహరిపురం వద్ద జరిగిన వినాయకుని పూజా కార్యక్రమాల్లో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు.

విశేషంగా అన్నసమారాధనలు

గోపాలపట్నం: వినాయక ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 92, 89 వార్డుల్లో పలు చోట్ల శనివారం అన్నసమారాధనలు నిర్వహించారు. గోపాలపట్నం రైతు బజారులో నిర్వహించిన అన్నసమారాధనను వ్యసాయ మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేట్ అధికారి నారాయణరావు, సహాయకుడు శివ, రైతులు వినియోగదారులు పాల్గొన్నారు.


గోపాలపట్నం రైతు బజారులో అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్


సాయినగర్ అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న రేణుకా గోపాలకృష్ణ

● కొత్తపాలెం సాయినగర్‌లో నిర్వహించిన అన్నదానంలో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. తొలుత మండపంలో వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు.

● కొత్తపాలెం మనస్టార్స్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను వైఎస్సార్ సీపీ నాయకుడు, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో దేవుడు బాబు, గౌరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపాలెంలో వడ్డన చేస్తున్న దొడ్డి కిరణ్

చట్టాలపై రైతులు అవగాహన పెంచుకోవాలి


లీగల్ ఎయిడ్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణ, ఈవో కృష్ణమోహన్

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం పరిధి దేవేంద్రనగర్‌లో గల కంచరపాలెం రైతుబజారులో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం 'వ్యాపార వ్యవహారాల'పై రైతులకు, వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎఫ్ఈడీసీవో చైర్మన్ మర్రి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. నేటి వ్యాపార సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రైతు పంట పండించే వ్యాపారే కాదు వినియోగదారుడు కూడా అని తెలిపారు. రైతులను గౌరవించే బాధ్యత ప్రతి వినియోగదారునిపై ఉందన్నారు. రైతుబజారులో లీగల్ ఎయిడ్ క్లినిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో రైతులు, వినియోగదారుల కోసం ఫిర్యాదు బాక్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైతుబజారు ఈవో కృష్ణమోహన్, అటెండర్ దిలీప్, లీగల్ కమిటీ సభ్యులు, రైతులు, డ్వాక్రా సభ్యులు, వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్త కళా ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సీఐ విద్యాసాగర్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళా ప్రదర్శనను మల్కాపురం సీఐ విద్యాసాగర్ శనివారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 20 స్టాల్స్ ఏర్పాటు చేశారు. చేనేత వస్త్రాలు,వివిధ రకాల ఆభరణాలు ప్రదర్శనలో ఉంచారు.

నర్సింగ్‌హోమ్ ఎదుట ఆందోళన

- పరిహారం ఇప్పించాలని డిమాండ్
- నర్దిచెప్పిన పోలీసులు


నర్సింగరావు (ఫైల్)

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీకి శరగడం నర్సింగరావు (50) ఆస్మాతో బాధపడుతున్నాడు. ఇదే వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం కూడా వైద్యం కోసం నర్సింగ్ హోమ్‌కు వచ్చాడు. అయితే సిబ్బంది వైద్యులు అందుబాటులో లేరని చెప్పి ఓ రూమ్‌లోకి నర్సింగరావును తీసుకు వెళ్లారు. శరీరం మొత్తం చల్లబడి ఉందని,మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రికి తరలించాలని రోగి బంధువులకు సిబ్బంది ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన బంధులు స్థానిక సెయింట్ ఆన్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు నర్సింగరావు అప్పటికే మృతి చెందాడని వివరించారు. దీంతో తొలుత చేరిన నర్సింగ్ హోమ్‌కు బంధువులు వచ్చి నర్సింగరావు మృతికి ఆస్పత్రి సిబ్బందే కారణం అంటూ ఆందోళన చేశారు. దీంతో భయపడిన సిబ్బంది ఆస్పత్రి గేటుకు తాళాలు వేసుకున్నారు. సమాచారం అందుకున్న మల్కాపురం సీఐ విద్యాసాగర్ అక్కడకు వచ్చి ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు శవపరీక్ష నిమిత్తం తరలించారు. నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన వివరించారు. కాగా నర్సింగరావు మృతికి ఆస్పత్రి సిబ్బందే కారణమని.. ఆర్థిక సాయం అందించాలని బంధువులు డిమాండ్ చేశారు.


మృతుడి బంధువులను విచారిస్తున్న సీఐ విద్యాసాగర్

లోక్ అదాలత్‌లో 579 కేసుల పరిష్కారం


కార్యక్రమంలో మాట్లాడుతున్న 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 579 కేసులు పరిష్కారమయ్యాయి. పరిష్కారమైన కేసుల విలువ రూ.5.36 కోట్లుగా కోర్టు వర్గాలు తెలిపాయి. శిబిరాన్ని 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.షణ్ముఖరావు ప్రారంభించారు. అనంతరం వివిధ బెంచీల్లో కొనసాగిన అదాలత్ శిబిరాల్లో కక్షిదారులు తమ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకున్నారు. 8వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో రూ.2.36 కోట్ల విలువైన 28 కేసులు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.1.15 కోట్ల విలువైన 44 కేసులు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.33.75 లక్షల విలువైన 3 కేసులు, బ్యాంకు మేటర్‌కు సంబంధించి రూ.1.83 లక్షల విలువైన ఒక కేసుతో పాటు 8వ ఏసీఎంఎం కోర్టులో రూ.66.01 లక్షల విలువైన 220 కేసులు, 3వ ఏసీఎంఎం కోర్టులో రూ.82.79 లక్షల విలువైన 283 కేసులు పరిష్కారమైనట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో న్యాయమూర్తులు వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, పి.ప్రదీప, సీనియర్ న్యాయవాదులు, గాజువాక బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షం వీడినా.. వదలని బెడద


చంద్రనగర్ అండర్‌పాస్‌వేలో నిలిచిన నీరు

గోపాలపట్నం: వర్షం వీడినా వరద బెడద తీరలేదని చంద్రనగర్, కొత్తపాలెం పరిసర ప్రాంత వాసులు వాపోతున్నారు. ఇటీవల రైల్వే అధికారులు నిర్మించిన అడర్‌పాస్‌వేలో నీరు చేరుతోంది. ఇది మోకాలి లోతు వరకు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు ఆగిపోయి మూడు రోజులు గడుస్తున్నా ఇక్కడి నీరు తగ్గలేదు. అండర్ పాస్‌వే బ్లాక్‌ల సందుల్లో నుంచి నీరు ఉబికి రావడంతో నీరు నిల్వ ఉండి పోతుందని చెబుతున్నారు. ఈ నీరు వెళ్లేందుకు సరైన ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి నీరు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.